క్లుప్తంగా

విశేషంగా శ్రవణ నక్షత్ర హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రవణ నక్షత్ర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ మండపంలోని హోమగుండం వద్ద విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం,మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న విశ్వనాథనాయుడు

పెందుర్తి: మండలంలోని వాలిమెరక జుత్తాడలో కంచిపాటి రాము మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ జెడ్పీటీసీ కంచిపాటి విశ్వనాథనాయుడు చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో క్రీడల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. గుర్రంపాలెం సర్పంచ్ ఉగ్గిన గోవింద, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

గాయత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు



బ్రహ్మకపాలం మూత వేస్తున్న అర్చకులు

పెందుర్తి: చీమలాపల్లిలోని శ్రీవేదమాత గాయత్రీ దేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మకపాలానికి ప్రత్యేక పూజలు చేసి మూత వేశారు. కెంగం రామకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో కార్పొరేటర్ ముమ్మన దేముడు, నాయకులు అయిత ఎర్రయ్య, దువ్వ అప్పారావు, సంతోష్, గోవింద్, అప్పారావు, అప్పలరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాలినడకన సుబ్రహ్మణ్యస్వామి సన్నిధికి..



కాలినడకన కావిళ్లతో వెళ్తున్న అయ్యప్ప మాలధారణ భక్తులు

సబ్బవరం: స్థానిక సాయిదుర్గా పీఠంలోని అయ్యప్ప మాలధారణ భక్తులు ఆదివారం అంతకాపల్లి గ్రామంలోని లగుడువారి కొంపల వద్ద కొలువైన స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి కావిళ్లతో నడుచుకుంటూ వెళ్లి స్వామివారికి స్వాములతా కావిళ్లు సమర్పించారు. 19 ఏళ్లుగా గురుస్వాములు ద్వారపూడి శ్రీను,చిత్రాడ శ్రీను ఆధ్వర్యంలో కావిళ్లు స్వామివారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: వెంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి విశేష పూజలు జరిపారు. వేంకటేశ్వరస్వామి హోమం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గోదా, పద్మావతి సహిత శ్రీనివాస కల్యాణం వేడుకగా. అనంతరం పవిత్ర సమర్పణ చేశారు. ఈవో నీలిమ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు: అత్యంత సుందరంగా పురుషోత్తపురం పాఠశాల ఆవరణ





నాడు: అధ్వానంగా పాఠశాల ప్రవేశ మార్గం

నేడు: పురుషోత్తపురం పాఠశాలలో టేబుళ్లపై భోజనాలు చేస్తున్న విద్యార్థులు





నాడు: నేలపై భోజనం చేస్తున్న విద్యార్థులు

- నాడు-నేడుతో మహర్దశ
- అందుబాటులో డిజిటల్ బోధన
- సౌకర్యాలతో కార్పొరేట్ లుక్

మన బడి నాడు-నేడు

సర్కారు బడి.. నూతన ఒరవడి



చదువే పిల్లలకు ఇచ్చే ఆస్తి.. చదువే అన్నింటికీ మూలం.. చదువుకుంటే చాలు తనను తాను, కుటుంబ స్థితిగతులను మార్చే శక్తి దాని సొంతం. అలాంటి విద్యను పేద, బడుగు, బలహీన వర్గాలకు చేరువ చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు కల్పించడానికి నాడు-నేడు మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు. బోధన పద్ధతులు మార్చడంతో పాటు డిజిటల్ విద్య అందుబాటులోకి తెచ్చారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, విదేశీ విద్యా దీవెన,వసతి దీవెన,ఇలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విద్యను బలోపేతం చేస్తున్నారు.

నాడు- నేడు మొదటి దశ పాఠశాలలు - 17

రెండో దశలో గుర్తించిన పాఠశాలలు - 51

మొత్తం నిధులు రూ.25.99 కోట్లు



నాడు : పెందుర్తి మండలం కరకవానిపాలెం మండల పరిషత్ పాఠశాల



నేడు : ఆహ్లాదకర వాతావరణంలో..

పెందుర్తి: పురుషోత్తపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 2019కి ముందు ఇరుగ్గా ఉండేది. గాలి వెలుతురు వంటివి తరగతి గదుల్లోకి రాకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రం ఆపసోపాలు పడేవారు. ఈ పాఠశాలలో చదివేందుకు పిల్లలు అంతగా ఆసక్తి కనబరిచేవారు కాదు. ఈ క్రమంలో 2019 లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తరువాత నాడు-నేడు పథకం ప్రవేశపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా పురుషోత్తపురం మండల పరిషత్ పాఠశాలకు రూ.20.08 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో పాఠశాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో చదివేందుకు స్థానికంగా ఉన్న పిల్లలు క్యూ కడుతున్నారంటే అతిశయోక్తి కాదు.

చింతలగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే గ్రామం ఇది. విశాలమైన ప్రాంగణం ఉన్నా సౌకర్యాల కల్పనకు నాటి ప్రభుత్వం అంతగా ఆసక్తి చూపలేదు. దీంతో తాగునీటికి, మరుగుదొడ్ల వసతికి విద్యార్థులు తీవ్ర అవస్థలు పడేవారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ఈ పాఠశాలకు రూ.62.43 లక్షల నిధులు మంజూరు చేసింది. దీంతో ఈ పాఠశాల అత్యాధునిక హంగులతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. పాఠశాలలో ఏర్పాటు చేసిన వసతులను చూస్తున్న విద్యార్థులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈ రెండే కాదు.. పెందుర్తి మండలంలోని పాఠశాలలు నాడు-నేడు పథకంలో తొలి దశలో 17, రెండో దశలో 51(మూడు అంగన్‌వాడీలు కలిపి) పాఠశాలలు ఎంపిక కాగా రూ.25.99 కోట్లు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం రెండోదశలో 51వ పాఠశాలల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి.



నాడు : కళావిహీనంగా కరకవానిపాలెం పాఠశాల



నేడు : ఆహ్లాదకర వాతావరణంలో తరగతి గది

ఇంటికి వెళ్లబుద్ధి కావడం లేదు



నేను చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నాను. పాఠశాలల్లో కనీస సౌకర్యాలు ఉండేవి కాదు. రెండేళ్ల కిందట వరకు మా పాఠశాలలో కనీసం మరుగుదొడ్లు సరిగా ఉండేవి కాదు. పాఠశాలను నాడు-నేడులో అభివృద్ధి చేసి మంచి మరుగుదొడ్లు కట్టారు. అంతేకాదు తరగతి గదులను సుందరంగా తీర్చిదిద్దారు. మంచి ప్రమాణాలతో ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. ఇటీవలే పాఠశాల తరపున విజయవాడలో జరిగిన యూత్ ఫెస్ట్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది.పాఠశాలకు వచ్చిన తర్వాత ఇంటికి వెళ్లాలన్న ఆలోచన కూడా రావడం లేదు.

–రేపాక గ్రీష్మ, పురుషోత్తముపురంపాఠశాల

నేల మీద కూర్చునే వాళ్లం



రెండేళ్ల కిందట వరకు పాఠశాలకు రావాలంటే భయంగా ఉండేది. నేల మీదే కూర్చుని పాఠాలు వినే వాళ్లం. భవనం కూడా శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలిపోతుందో అని భయపడేవాళ్లం కానీ ఇప్పుడు పూర్తిగా పరిస్థితి మారిపోయింది. అన్ని సౌకర్యాలు వచ్చాయి. దీంతో ఏ భయం లేకుండా బాగా చదువుకోగలుతున్నాం.

–దేశరాజు చేతన్ ,కరకవానిపాలెం

విద్యకు అత్యంత ప్రాధాన్యం



చదవుకుంటేనే పిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుంది. పిల్లలు చదువుపై ఆసక్తి చూపాలంటే పరిసరాలు కూడా అందుకు తగ్గట్టు ఉండాలి. అలాంటి బృహత్తర ఆలోచన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చింది. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దారు. నాడు-నేడు పథకంలో అభివద్ధి చెందిన పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్తిస్థాయిలో ప్రాధాన్యవ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమే.

– టి.మధుమూర్తి, ఎంఈవో–2, పెందుర్తి.



నాడు : శిథిలమైన మరుగుదొడ్లు



నేడు : కరకవానిపాలెం పాఠశాలలో మెరుస్తున్న మరుగుదొడ్లు

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణం తిలకిస్తున్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అదిష్ఠింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేసి హారతులు ఇచ్చారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం ఏఈవో భ్రమరాంబ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అదిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఆత్మీయ కలయిక.. అపూర్వ వేడుక



మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–2001 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా తమకు 23 ఏళ్ల కిందట విద్యా బుద్ధులు నేర్పించిన గురువులు బి. యేసుదాసు,ఆనంద్,అనితలను ఘనంగా సత్కరించారు. ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆట పాటలతో ఆనందంగా గడిపారు. మధ్యాహ్నం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులంతా సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు అప్పలనాయుడు,సింగంపల్లి బంగారునాయుడు,బోకం సునీత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలుచోట్ల విద్యుత్ పరమైన మరమ్మతులు చేపట్టడానికి వీలుగా సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈపీఎల్‌డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఈ.బోనంగి, బొద్దపువానిపాలెం, గొర్లివానిపాలెం, పోర్టుకో, జాజులవానిపాలెం, గౌతులచ్చన్ననగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఆ ప్రకటనలో తెలిపారు.తిరిగి సాయంత్రం 5.30 గంటలకు విద్యుదుత్పత్తిని పునరుద్ధరిస్తామని ఏఈ రామకృష్ణ తెలిపారు.

రెండో రోజు కొనసాగిన తొలగింపులు

సింహాచలం: అడవివరంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా నుంచి పాత అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులు సాగుతున్నాయి. జీవీఎంసీ అధికారులు రెండోరోజు ఆదివారం కూడా రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలను తొలగించే పనులు చేపట్టారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకున్నారు. రెండో ఘాట్‌రోడ్డు మీదుగా వాహనాలను మళ్లించారు. కాగా బీఆర్‌టీఎస్ బాధితులను మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా నిర్మాణాలు తొలగించడం అన్యాయమన్నారు.

'ఆదర్శప్రాయురాలు ఇందిర'

పెందుర్తి/సింహాచలం/ పరవాడ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పెందుర్తి, అడవివరం, పరవాడ శాఖా గ్రంథాలయాల్లో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆదర్శప్రాయురాలు ఇందిరా గాంధీ అని కొనియాడారు. కార్యక్రమాల్లో అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, ప్రొఫెసర్ దేవులపల్లి పద్మజ, బి.బి.రాజేంద్రప్రసాద్, కార్పొరేటర్ శానాపతి వసంత, గ్రంథాలయ అధికారి సూర్యకళ, పరవాడలో సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు,ఉక్కు సాహితీ సమాఖ్య సభ్యులు దుర్గాప్రసాద్, ఎ.శ్రీనివాసరావు, పి.ఎస్.ఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేయిస్తున్న సహకార యూనియన్ విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు

సబ్బవరం: సబ్బవరంలోని జాగృతి కార్యాలయంలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏపీ సహకార విద్యాశాఖ అధికారి జి. సోమేశ్వరరావు సహకార జెండాను ఆవిష్కరించారు.అనంతరం సహకార చట్టాలను ,నియమాలను గౌరవిస్తామని సంఘం సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాగృతి సహకార సంఘం 22 వేల మంది సభ్యులతో రూ.30 కోట్ల టర్నోవర్‌తో పారదర్శకంగా సభ్యులకు సేవలు అందిస్తుందన్నారు. జాగృతి ఎండీ సుజాత మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల మహిళల,వ్యవసాయదారుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షురాలు జి. అప్పలనర్శమ్మ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.